పాహిమాం సాయినాథా..!

- ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు
- బాబాకు భక్తుల విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో సద్గురు సాయినాథుడు

ఆరిలోవ: నియోజకవర్గంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా షిర్డీసాయిబాబా మందిరాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు, ప్రజాప్రతినిధులు సద్గురు సాయినాథుడిని మనసారా దర్శించుకుని తరించారు. ఆరిలోవ ప్రాంతంలోని సాయిబాబా మందిరాలు భక్తులతో కళకళలాడాయి. జీవీఎంసీ 12వ వార్డు చినగదిలిలోని నార్త్ షిరిడీ సాయిబాబా ఆలయంలో భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామిని దర్శించుకుని పూజలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్ స్వామిని దర్శించుకున్నారు. ఆలయం నిర్వాహకులు మేయర్‌కు సాదర స్వగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయం ప్రాంగణంలో మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనలో భారీగా భక్తులు పాల్గొన్నారు.

- 13వ వార్డు సాయినగర్‌లో కార్పొరేటర్ కెల్ల సునీత, వైఎస్సార్‌సీపీ నాయకులు కెల్ల సత్యనారాయణ, వెంకటరెడ్డి, దుర్గ తదితరులు సాయిబాబాకు పూజలు చేశారు. అనంతరం అక్కడ నిర్వహించిన అన్నసమారాధనలో పాల్గొని భక్తులకు భోజనాలు వడ్డించారు.
- జీవీఎంసీ తొమ్మిదో వార్డు విశాలాక్షినగర్ సాయిబాబా మందిరంలో నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. ఇదే వార్డు సంజయ్‌గాంధీ కాలనీ, హనుమంతవాక, పదో వార్డు ఆదర్శనగర్, 11వ వార్డు బాలాజీనగర్ ప్రాంతాల్లోని సాయిబాబా మందిరాల్లో గురుపౌర్ణమి పూజలు ఘనంగా జరిగాయి.


చినగదిలి షిరిడీ సాయిబాబా మందిరంలో పూజలు చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి


13వ వార్డు సాయినగర్‌లో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ సునీత

బాబాకు విశేషంగా అన్నాభిషేకం

జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్‌లోని సాయిబాబా ఆలయంలో అధిక సంఖ్యలో భక్తులు పూజలు చేశారు. బాబాకు అన్నాభిషేకం విశేషంగా చేపట్టారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం సాయినామ కీర్తనలతో భజనలు చేశారు. కార్యక్రమంలో జేసీఎస్ 8వ వార్డు ఇన్‌చార్జి ఉప్పలూరి గోపి, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నాగేశ్వరావు, సెక్రటరీ పిల్లల రాజులు, కోశాధికారి అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

విశేష అలంకరణలో సద్గురు సాయినాథ్

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని సమర్థ సద్గురు సాయినాథ్ ఆలయంలో ప్రత్యేక పూజలు, అఖండ హారతితోపాటు అభిషేకాలు నిర్వహించారు. తులసి మాలలతో బాబా విగ్రహాన్ని విశేషంగా అలంకరించారు. ఉదయం నుంచి ఆలయానికి భారీగా భక్తులు తరలివచ్చి సాయిబాబాను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు సత్యకుమార్, ప్రసాదరావు తదితరులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.


విశాలాక్షినగర్‌లో సాయినాథుడి దివ్యరూపం


8వ వార్డు ఆలయంలో అన్నాభిషేకంలో సాయి


సాగర్‌నగర్ సాయి మందిరంలో భజన చేస్తున్న భక్తులు


ఎంవీపీ సెక్టార్-6లో సాయిబాబాను దర్శించుకుంటున్న భక్తులు

విద్యార్థుల రీజాయినింగ్


విద్యార్థులకు జేవీకే కిట్లు అందిస్తున్న డీఈవో చంద్రకళ

ఏయూక్యాంపస్: రాష్ట్ర ప్రభుత్వం సూచించిన విధంగా పదో తరగతి పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులను తిరిగి పాఠశాలలో చేర్చుకునే కార్యక్రమం ప్రారంభమైంది. 20వ వార్డు కేడీపీఎం పాఠశాలలో 2022–23 విద్యా సంవత్సరంలో ఫెయిలైన విద్యార్థులను తిరిగి పాఠశాలలో చేర్చుకున్నారు. వీరికి ప్రస్తుత బ్యాచ్ విద్యార్థులతో కలిసి తరగతులకు హాజరయ్యే అవకాశం కల్పించారు. సోమవారం డీఈవో ఎల్.చంద్రకళ చేతుల మీదుగా జగనన్న విద్యా కానుక కిట్లను వీరికి అందించారు. ఫెయిలైన విద్యార్థులకు సైతం ప్రభుత్వ పథకాలు అందించేలా కృషి చేస్తున్నామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం


అన్నప్రసాదం వడ్డిస్తున్న పీతల గోవింద్

బీచ్‌రోడ్డు: గురుపౌర్ణమి సందర్భంగా సోమవారం శివాజీపాలెం సాయిబాబా దేవాలయం, పిఠాపురం కాలనీ సాయిబాబా గుడి వద్ద భారీ అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఏపీ స్టేట్ పోలీస్ హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్ భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు.

క్లుప్తంగా

వైఎస్సార్ బీమా అందజేత


మృతురాలు జానకి కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

ఆరిలోవ: జీవీఎంసీ పన్నెండో వార్డు పరిధి రాజేంద్రనగర్‌లో రెండు రోజుల క్రితం జానకి అనే మహిళ అనారోగ్యంతో మృతి చెందారు. ఆమెకు వైఎస్సార్ బీమా వర్తించడంతో సచివాలయ సిబ్బంది సోమవారం మృతురాలి ఇంటికి వెళ్లి ఆమె కుమార్తెకు తక్షణ సాయం కింద రూ.10 వేల నగదు అందజేశారు. మిగిలిన నగదు కొద్ది రోజుల్లో బ్యాంక్ ఖాతాలో జమ చేస్తారని కుటుంబీలకు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకుడు కన్నేటి సుబ్బారెడ్డి, సచివాయ వెల్ఫేర్ సెక్రటరీ డి.సీ తారాం, శానిటరీ సెక్రటరీ అబ్దుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

ఐఐపీఈ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ


శిక్షణలో పాల్గొన్న ఐఐపీఈ విద్యార్థులు

ఏయూక్యాంపస్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ(ఐఐపీఈ)కి చెందిన 31 మంది విద్యార్థులు జూన్ 15 నుంచి 28 వరకు పూణేలోని ఎంఐటీ వరల్డ్ పీస్ యూనివర్సిటీలో నిర్వహించిన 'రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ పెట్రోలియం ఇంజినీరింగ్' నైపుణ్య శిక్షణ కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జియో కెమిస్ట్రీ, ఆఫ్‌షోర్, నేచురల్ గ్యాస్ తదితర అంశాలపై వారికి విస్తృత అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐఐపీఈ ఇండస్ట్రీ ప్రొఫెషనల్, గెయిల్ సీజీఎం పంకజ్ భగత్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూ స్కూల్‌లో టాయిలెట్స్ ప్రారంభం


విద్యార్థులతో కలిసి టాయిలెట్స్ ప్రారంభిస్తున్న రెక్టార్ సమత, రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆంగ్ల మాధ్యమం పాఠశాలలో లారస్ ల్యాబ్స్ సహాయంతో నూతనంగా నిర్మించిన టాయిలెట్స్ బ్లాక్‌ను సోమవారం విద్యార్థులతో కలిసి ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్‌లు ప్రారంభించారు. విద్యార్థులకు ఉపయుక్తంగా వీటిని నిర్మించి అందించిన లారస్ ల్యాబ్ డైరెక్టర్ చేవ సత్యనారాయణకు వర్సిటీ తరపున వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మహాసభల కరపత్రం ఆవిష్కరణ


జాతీయ మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కార్మికులు

మహారాణిపేట: ఆల్ ఇండియా కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ 4వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కార్మికులు కోరారు. సోమవారం కురుపాం మార్కెట్ వద్ద మహాసభల కరపత్రాన్ని విడుదల చేశారు. ఈనెల 8,9 తేదీల్లో కన్యాకుమారిలో ఈ మహా సభలు జరగనున్నాయని తెలిపారు. వేతనాలు రెట్టింపు చేయాలని, కార్మికులందరికి పీఎఫ్, పెన్షన్, ఉచిత విద్య, ఆరోగ్య సేవలు, 8 గంటల పని దినం, అదనపు పనికి డబుల్ ఓటీ ఇవ్వాలని యూనియన్ కార్యదర్శి జి.జానకీరావు కోరారు.

ప్లాస్టిక్ రహిత జీవనం అలవర్చుకోవాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: ప్లాస్టిక్ రహిత జీవనాన్ని అలవర్చుకోవాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం తన కార్యాలయంలో ఇంటర్నేషనల్ ప్లాస్టిక్ ఫ్రీ బ్యాగ్ డేని పురస్కరించుకుని ప్రత్యేక పోస్టర్‌ను ఆవిష్కరించారు. 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను విడనాడాలి–చేతి సంచులను వినియోగించాలి' అనే నినాదంతో తయారు చేసిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ప్రతి విద్యార్థి చక్కని సందేశాన్ని సమాజంలోకి తీసుకువెళ్లే దిశగా ఆచార్యులు కృషి చేయాలన్నారు. విద్య విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్లాస్టిక్‌పై నిషేధం విధించినట్లు తెలిపారు. దీనిలో భాగంగా రాష్ట్రంలో సైతం సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని నిషేధించారని, దీనిని ప్రజలంతా పాటించాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వలన కలిగే నష్టాలను గుర్తించాలని, భవిష్యత్ తరాలు పర్యావరణ పరిరక్షణలో భాగం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, వై.రాజేంద్రప్రసాద్, జి.శశిభూషణరావు, డాక్టర్ బి.ప్రవీణ, డాక్టర్ వి.వి.వి ప్రకాష్, డాక్టర్ కె.రాము, డాక్టర్ రాజు, హేమలత తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణకు సహకరించండి


జీవీఎంసీ కార్యాలయానికి సైకిల్‌పై వస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

డాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణకు, పర్యావరణ పరిరక్షణకు అందరి సహకారం అవసరమని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా సోమవారం క్యాంపు కార్యాలయం నుంచి జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సైకిల్‌పై చేరుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విశాఖలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా పర్యావరణ పరిరక్షణకు అందరు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ఉద్యోగులు, నగర ప్రజలు, వివిధ వ్యాపార సంస్థలు, విద్యా సంస్థల యాజమాన్యం తదితరులు కాలుష్య నియంత్రణకు సహకరించి, వారంలో ఒక్కరోజు ప్రజారవాణాను ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు. కాలుష్య నియంత్రణకు ప్రతి సోమవారం తనతో పాటు జీవీఎంసీ ఉద్యోగులు తమ వాహనాలు వదిలి ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగిస్తున్నారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులకు గాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి

పీఎం పాలెం: జాతీయ రహదారిపై మధురవాడ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులు గాయాలపాలయ్యారు. ఇందుకు సంబంధించి పీఎంపాలెం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధురవాడ మండల కాలనీకి చెందిన ఎస్.రాజేష్(15) 9వ తరగతి, కె.సుశాంత్(16) 10వ తరగతి, ఎం.దినేష్ (12) 7వ తరగతి చదువుతున్నారు. సోమవారం ఉదయం 8.15 గంటల ప్రాంతంలో పాఠశాలకు బయలుదేరిన వీరు మధురవాడ బస్టాపు వద్ద జాతీయ రహదారి దాటుతుండగా ఆనందపురం వైపు నుంచి నగరంలోకి వస్తున్న గుర్తు తెలియని ద్విచక్ర వాహనం బలంగా ఢీకొట్టింది. అనంతరం వాహనదారుడు పరారయ్యాడు. ఈ ఘటనలో ఇద్దరు విద్యార్థులకు తీవ్రంగా, ఒకరికి స్వల్పంగా గాయలయ్యాయి. ప్రస్తుతం వీరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విగ్రహాల ఆవిష్కరణ నేడు


ఆవిష్కరణకు సిద్ధంగా ఉన్న మల్లుదొర, గంటం దొర విగ్రహాలు

కొమ్మాది: రుషికొండలో గల గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణా భవన్ ప్రాంగణంలో మల్లుదొర, గంటం దొర విగ్రహాలు సిద్ధమయ్యాయి. వీటిని మన్యం దొర అల్లూరి సీతారామరాజు 156వ జయంతిని పురస్కరించుకుని డిప్యూటీ సీఎం రాజన్న దొర మంగళవారం ఆవిష్కరించనున్నట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.చిన్నబాబు తెలిపారు.

విత్తన బంతులతో హరితవనం


అవగాహన కల్పిస్తున్న ట్రస్ట్ సభ్యులు

కొమ్మాది: పర్యావరణ పరిరక్షణ కోసం అందరం కలిసి విత్తన బంతులతో హరిత వనాన్ని సృష్టిద్దామని మహావీర్ ఇంటర్నేషనల్ లేడీస్ ట్రస్ట్ చైర్‌పర్సన్ సునీత పిలుపునిచ్చారు. భీమిలి బీచ్ రోడ్ తొట్లకొండపై సోమవారం 70 రకాల విత్తనాలతో తయారు చేసిన 18 వేల సీడ్ బాల్స్‌ను ఈ ప్రాంతంలో జల్లారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ వేసవిలో అత్యధికంగా ఉష్ణోగ్రతను చూశామన్నారు. దీనిని నియంత్రించాలంటే విస్తారంగా మొక్కలు నాటాలన్నారు. విత్తన బంతుల ద్వారా సామాజిక వర్గాలు పెంచుతున్నామని, వాతావరణంలో ప్రస్తుతం 21 శాతం ఆక్సిజన్ ఉందని, దానిని 23.5 శాతానికి పెంచుతామని తెలిపారు. అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి కోరారు. జేవీ రత్నం, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

బుల్లయ్య కాలేజీలో ముగిసిన వర్క్‌షాప్

సీతంపేట: బోధనలో నాణ్యత మెరుగుపర్చుకోవడానికి లంకపల్లి బుల్లయ్య కాలేజీలో 'ఫలితాల ఆధారిత విద్యాభ్యాసం, పరిశోధన' అనే అంశంపై నిర్వహించిన ఐదు రోజుల వర్క్‌షాప్ సోమవారంతో ముగిసింది. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ ముఖ్య అతిథిగా ప్రసంగిస్తూ నైపుణ్యాల మెరుగుకు ఇటువంటి వర్క్‌షాప్‌లు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ దీపక్ చౌదరి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.శ్రీకాంత్, కన్వీనర్ జె.బాబు, కళాశాల విభాగాధిపతులు పాల్గొన్నారు.

'స్పందన'కు 22 అర్జీలు


అర్జీలు పరిశీలిస్తున్న తహసీల్దార్

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 22 అర్జీలు అందాయి. ప్రజల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఆనంద్‌కుమార్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

మహిళలకు ఉచిత శిక్షణ

మురళీనగర్: మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 5 నుంచి మహిళలకు ఆర్టిఫిషియల్ జ్యూవెలరీ తయారీతోపాటు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శేషామణి, ఎస్.పుష్పలత ఒక ప్రకటనలో తెలిపారు. మురళీనగర్‌లో ప్రతి రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తరగతులు జరుగుతాయన్నారు. ఆసక్తి గల మహిళలు 63035 52016 నంబర్‌లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

కిటకిటలాడిన కేజీహెచ్


కేజీహెచ్‌లో రద్దీ

మహారాణిపేట : సోమవారం ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయిని కేజీహెచ్ రోగులు, భక్తులతో కిటకిటలాడింది. సాధారణంగానే ప్రతిరోజూ రోగులు, వారి సహాయకులతో రద్దీగా ఉండే కేజీహెచ్ గురుపౌర్ణమి సందర్భంగా ఇసుకకొండ సత్యనారాయణస్వామి దేవాలయానికి వెళ్లే భక్తులతో కిక్కిరిసిపోయింది. రోగులు, భక్తులకు ఒకటే మార్గం కావడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఇక్కడ కొత్తగా ఓపీ కౌంటర్లు ప్రారంభించినా రద్దీ మాత్రం యథావిధిగానే ఉంది.

'కాన్సెప్ట్స్ ఆఫ్ సివిల్ సర్వీసెస్' గ్రంథావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య కె.సి.రెడ్డి

సీతంపేట: డాక్టర్ చెంబూరు వెంకటరావు రచించిన 'కాన్సెప్ట్స్ ఆఫ్ సివిల్ సర్వీసెస్' గ్రంథావిష్కరణ సుహిత సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ ఆంధ్రప్రదేశ్ చాన్సలర్ ఆచార్య కె.సి.రెడ్డి ముఖ్య అతిథిగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్ సర్వీసెస్ సాధించడం చాలా మందికి ఒక కల అయితే.. అది సఫలం కావడానికి మంచి శిక్షణ అధ్యయనం అవసరమన్నారు. వర్తమాన విషయాలు, వివిధ శాస్త్రాలపై మంచి అవగాహన ఉండేలా రచయిత వెంకటరావు వెలువరించిన పుస్తకం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. సభాధ్యక్షుడు డాక్టర్ యు.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సివిల్ సర్వీసెస్ రాసే వారికి ఉపయోగపడే విలువైన పుస్తకాన్ని రచించిన డాక్టర్ వెంకటరావు అభినందనీయులన్నారు. ఆచార్య ప్రయాగ సుబ్రహ్మణ్యం పుస్తకాన్ని సమీక్షించారు. రచయిత వెంకటరావు మాట్లాడుతూ 40 ఏళ్లకు పైగా అధ్యాపకుడిగా పోటీ పరీక్షల బోధకుడిగా విశేషమైన అనుభవంతో ఈ పుస్తకాన్ని రాసినట్టు తెలిపారు. మానవీయ విజ్ఞాన శాస్త్రాలు, సాహిత్యం మొదలైన అంశాలను పరిచయం చేశానన్నారు.

పౌర గ్రంథాలయంలో గురుపూజోత్సవం


పౌర గ్రంథాలయంలో వీణానాదంతో అలరిస్తున్న జోగులాంబ శిష్య బృందం

సీతంపేట: సంగీత విద్వన్మణి మల్లాప్రగడ జోగులాంబ స్మృత్యర్థం కార్తికేయ కళాక్షేత్రం ఆధ్వర్యంలో సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రఖ్యాత వీణా విద్వాంసురాలు బండి శ్యామలకు గురు సత్కారం చేశారు. జోగులాంబ శిష్యులు నిష్టల కృష్ణవేణి, వి.అరుణ, ఎం.శివాని, వి.సుబ్బలక్ష్మి వీణానాదంతో అలరించారు. త్యాగరాజు రాసిన తిరువత్తియూరు పంచరత్నములను వీణానాదంతో వినిపించారు.

విశాఖ కేంద్రంగా చిత్ర పరిశ్రమ ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న ధనుంజయ్

డాబాగార్డెన్స్: విశాఖ కేంద్రంగా చిత్ర పరిశ్రమ ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాపా ధనుంజయ్, ఉపాధ్యక్షుడు బైటింటి మీనాక్షిరెడ్డి, దారపు ప్రసాద్‌రెడ్డి, ఏపీ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు తోరం రాజా కోరారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. చిత్ర పరిశ్రమలో నటీనటులు, సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ఏపీ మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ పనిచేస్తోందన్నారు. అసోసియేషన్ సభ్యులందరికీ పని కల్పించాలని, పనికి తగిన వేతనం ఇవ్వాలని, బీమా, ఈఎస్ఐ, పీఎఫ్ కల్పించాలని, సొంత గృహాల సాధన కోసం అసోసియేషన్ కృషి చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, టాలీవుడ్ పెద్దలు చర్చలు జరిపి చిత్ర పరిశ్రమపై ఆధారపడిన వారిని ఆదుకోవాలన్నారు. సమావేశంలో అసోసియేషన్ కోశాధికారి శిల్లా సుజాత, గంధం విజయరమణి, నిర్మలభాను, రెడ్డిపల్లి పూజాకుమారి, డి.ప్రసాదరెడ్డి, మత్తి రత్నకుమార్, తలారి సురేష్, కంద గాయత్రి, గొందేశి రమణారెడ్డి, భరత్, మానవరపు శ్రీనివాస్, ఏలూరు లక్ష్మి, దున్నా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తయిన మెట్ల మార్గం


శ్రీవారి కొండకు చేరుకునేందుకు పూర్తయిన మెట్ల నిర్మాణం

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి చేరుకునేందుకు కొండ దిగువ నుంచి మెట్ల మార్గం నిర్మాణం పూర్తయింది. 240 మెట్లు, మధ్యమధ్యలో ప్లాట్‌ఫారం, భక్తులకు ఎండ, వాన నుంచి ఇబ్బంది కలగకుండా పైకప్పు ఏర్పాటు చేశారు. శ్రావణ మాసంలో ఈ మార్గాన్ని అందుబాటులోకి తీసుకు రానున్నట్లు ఏఈవో జగన్‌మోహనాచార్యులు తెలిపారు.